క్లుప్తంగా

సాంకేతిక నైపుణ్యాన్ని పెంచేందుకు సెమినార్లు దోహదం



తెనాలి అర్బన్: విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాన్ని పెంచేందుకు సెమినార్లు దోహదపడతాయని ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ అన్నారు. విజయవాడలోని చాప్టర్ కంప్యూటర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కళాశాలలో డేటా అనలిటిక్స్‌పై శనివారం సెమినార్ నిర్వహించారు. విజయవాడ పి.వి.సిద్ధార్థ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.ఎస్.రవికిశోర్ డేటా అనలిటిక్స్‌పై అవగాహన కల్పించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ వి.వి.ఎస్.అజయ్, కంప్యూటర్ సైన్స్ హెచ్‌వోడీ డాక్టర్ ఎస్.సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన గోవింద నామ సంకీర్తన



తెనాలి: స్థానిక నెహ్రూ రోడ్డులోని శ్రీ గోవర్ధనస్వామి, శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి శ్రీ హరినామ సంకీర్తన బృందం ఆధ్వర్యంలో గోవింద నామ సంకీర్తన నిర్వహించారు. రెండున్నర గంటలు సాగిన కార్యక్రమంలో పెరవలి వంశీకృష్ణ ,అండె బాల చంద్రమౌళి, రాజేశ్వరి, తన్మయి, మాదల నాగఅర్చన, కొప్పరపు అనితమాధవి, తూనుగుంట్ల దుర్గామల్లేశ్వరి, కొత్తమాసు పుష్పలత, విష్ణుప్రియ, వేమవరపు లక్ష్మీనరసింహారావు, సాములూరి శివశంకరరాజు, టీవీఎస్ శాస్త్రి పాల్గొన్నారు. కార్యక్రమాన్ని శ్రీ రుక్మిణీ సమేత గోవర్ధనస్వామి, శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ



తెనాలి అర్బన్: కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం, మానవత సంస్థ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ సహకారంతో ఏఆర్‌టీ సెంటర్‌లో శనివారం హెచ్‌ఐవీతో బాధపడే చిన్నారులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహాప్రస్థాన సేవా సమితి కార్యదర్శి జెట్టి శివరామకృష్ణ మాట్లాడుతూ హెచ్‌ఐవీ చిన్నారులను అదుకునేందుకు దాతల సహకారంతో పౌష్టికాహార కిట్లను ప్రతి నెలా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సహకరిస్తున్న దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆశ్రమ సేవకులు అక్కల రమేష్, కుర్రా శ్రీను, దుర్గ, మధులత, అనూష, బి.పోతురాజు, శివారెడ్డి, అబ్రహం పాల్గొన్నారు.

ఐఎంఏ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం



తెనాలి రూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. శనివారం నామినేషన్లు స్వీకరించగా ఒకొక్కటి మాత్రమే దాఖలైంది. దీంతో నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైనట్టు పరిశీలకులు డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ జి. నరసింహారావు, డాక్టర్ ఎం.వి. సత్యనారాయణ తెలిపారు. 2024–25 సంవత్సరానికి అధ్యక్షుడిగా డాక్టర్ కె. అనిల్‌కుమార్, ఉపాధ్యక్షురాలిగా డాక్టర్ వి. పావని, కార్యదర్శిగా డాక్టర్ జి. మధుప్రభాకర్‌బాబు, సహాయ కార్యదర్శిగా డాక్టర్ చందు ఉదయ భాస్కర్, కోశాధికారిగా డాక్టర్ కొత్తమాసు శ్యామ్ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించి డిక్లరేషన్‌ను అందజేశారు.

24న మెగా జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో ఈనెల 24న సమర్ధనం ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.మల్లికార్జునప్రసాద్ తెలిపారు. శనివారం హిందూ కళాశాలలో జాబ్ మేళా పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ 30 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్న జాబ్‌మేళాలో టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల నిరుద్యోగ యువత హాజరుకావాలని సూచించారు. వివరాలకు 63648 67800 నంబర్లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, సమర్ధనం ట్రస్ట్ ఏపీ చాప్టర్ హెడ్ ఎంఆర్‌కే పరమహంస, బి. రంగారావు పాల్గొన్నారు.

మొద్దునిద్రలో మున్సిపల్ ఇంజినీరింగ్

- కుంటుపడుతున్న తెనాలి పట్టణాభివృద్ధి
- నెలలు దాటుతున్న పనులకు బిల్లులు పెట్టని ఏఈలు
- కౌన్సిలర్లు పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేసినా ఫలితం శూన్యం
- అధికారుల తీరుతో పనులు చేయడానికి ముందుకురాని కాంట్రాక్టర్లు



కాల్వ పూడికతీత పూర్తయి రెండేళ్లయినా బిల్లులు పెట్టని ఇంజినీరింగ్ సిబ్బంది (ఫైల్)

తెనాలి అర్బన్: తెనాలి పురపాలక సంఘ ఇంజినీరింగ్ వ్యవస్థ నిద్రావస్థలో ఉంది. అధికారులు, ఉద్యోగులు అలసత్వంతో వ్యవహరిస్తుండటంతో పట్టణ అభివృద్ధి కుంటుపడుతోంది. పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులను అసిస్టెంట్ ఇంజనీర్లు సకాలంలో రూపొందించకపోవడంతో కాంట్రాక్టర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీనిపై మున్సిపల్ కౌన్సిల్‌లో పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించి అసహనం వ్యక్తం చేశారు. అసిస్టెంట్ ఇంజనీర్లపై చర్యలు తీసుకోవాలని సూచించినా ఇప్పటి వరకు ఆ దిశగా అడుగులు పడలేదు.

ఉమ్మడి జిల్లాలో అతి పెద్ద పట్టణం

తెనాలి పట్టణం 16.77కిలో మీటర్ల విస్తీరణం ఉంది. దీనిలో 55,917 నివాస గృహాలున్నాయి. 2.60లక్షల జనాభాతో ఉమ్మడి జిల్లాలో అతి పెద్ద పట్టణంగా విస్తరించింది. జిల్లాలోనే ఏకైక సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా పేరుంది. ప్రతి ఏడాది వివిధ పన్నులు, షాపు అద్దెలు వంటి వాటి ద్వారా రూ.36 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఇవికాకుండా 15వ ఆర్థిక సంఘం, ఇతర గ్రాంట్ల ద్వారా రూ.50కోట్ల వరకు సమకూరుతుంటాయి.

నేటికీ ప్రారంభం కాని 169 పనులు

తెనాలి పట్టణంలో 2019 నుంచి 2024 వరకు 345 అభివృద్ధి పనులకు రూ.37.62కోట్లు నిధులు కేటాయిస్తూ కౌన్సిల్ అనుమతి ఇచ్చింది. వాటిలో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.25కోట్లు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.1.62కోట్లు, ఓటీఎస్ గ్రాంట్ కింద రూ.7కోట్లు, జనరల్ ఫండ్ కింద రూ.4కోట్ల ఉన్నాయి. నిధులున్నా నేటికీ 169 పనులు ప్రారంభమే కాలేదు. పూర్తయిన 160 పనులలో నేటికీ బిల్లులు పెట్టనివి సుమారు 50 వరకు ఉన్నాయని అధికారుల అంచనా.

నిధుల వివరాలు	పనుల సంఖ్య	పూర్తయినవి	ప్రారంభంకానవి	సగంలో ఉన్నవి
15వ ఆర్థిక సంఘం	106	31	75	---
జనరల్ ఫండ్	144	70	60	14
గడప గడపకు	62	48	14	----
ఓటీఎస్	33	11	20	02

అధికారుల నిర్లక్ష్యానికి ఉదాహరణలు

తెనాలి చెంచుపేట నుంచి అంగలకుదురు వెళ్లే రహదారి వెంట ఉన్న ప్రధాన కాల్వ పూడికతీత పనులు చేసి రెండేళ్ళు దాటుతోంది. వెహికల్ షెడ్‌లో ఉంచే వాహనాలకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేసి సుమారు ఏడాది దాటింది. పినపాడు, మారీసుపేట, రజకచెరువు ప్రాంతాలలో పలు రోడ్లు, కాల్వలు నిర్మించి ఆరు నెలలు దాటింది. నేటికీ వీటిలో ఒక్కదానికీ కూడా ఏఈలు బిల్లులు పెట్టి మంజూరు చేయించలేదు. దీనిని బట్టి చూస్తే వారి పనితీరు ఎలా ఉందో అర్థమవుతుంది.

బిల్లులు తయారు చేయడం కూడా రాదు

సాధారణంగా అభివృద్ధి పనులను ఏఈలు పరిశీలించి కంప్యూటర్‌లో బిల్లులు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపి మంజూరు చేయించాల్సి ఉంటుంది. కానీ తెనాలిలో పనిచేసే ఏఈలకు నేటికీ కంప్యూటర్‌లో బిల్లులు తయారు చేయడం రాదనే విషయం ఇటీవల కమిషనర్ నిర్వహించిన సమీక్షలో తెలిసి ఆయన అవాక్కు అయ్యారు. ఆగస్టులో పట్టణంలోని 3వ వార్డులోని నెహ్రూ నగర్ మొదటి లైన్‌లో రూ.8.95లక్షలతో సీసీ రోడ్డు నిర్మించేందుకు కౌన్సిల్ అనుమతి ఇచ్చింది. కానీ డీఈ ఆ రోడ్డును పరిశీలించి అది ప్రైవేట్ స్థలం అని, పనులు చేయవద్దని హుకుం జారీ చేశారు. అధికారులు ఎలా ఎస్టీమేషన్లు వేసి కౌన్సిల్ అనుమతి తీసుకున్నారని సదరు కాంట్రాక్టర్, కౌన్సిలర్ ప్రశ్నించడంతో అధికారులు నీళ్ళు నమిలారు. తీరా రికార్డులు పరిశీలిస్తే గతంలోనే మున్సిపాలిటీకి రోడ్డును అప్పగించినట్లు ఉంది. తెనాలి పట్టణంలో ఇలాంటి ఘటనలు కొల్లలని చెప్పవచ్చు.

పూర్తిగా నిలిచిపోయిన పనులు



3వ వార్డులో వివాదాస్పదమైన రోడ్డు ఇదే..

ఇంజినీరింగ్ అధికారులు తీరుతో తెనాలి పట్టణంలో అభివృద్ధి పనులు పూర్తిగా నిలచిపోయాయి. పట్టణంలోని వివిధ పనులకు ఈ టెండరింగ్ నిర్వహిస్తున్నా చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో అధికారులు మాట్లాడి టెండర్లు వేయిస్తున్నారు. వారు అయిష్టంగా వేసినా పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. గతంలో కాంట్రాక్టర్లు పోటీ పడేవారు. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీనికి కారణంగా అధికారులు పనితీరేననే మాట వినిపిస్తోంది. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇంజినీరింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రక్షాళన చేస్తాం



పురపాలక సంఘ పరిధిలోని ఇంజినీరింగ్ విభాగం అధికారులతో ఇప్పటికే సమీక్ష జరిపాం. పనితీరులో మార్పు రావాల్సిన అవసరం ఉందని సూచించాం. కొందరు అధికారులు బదిలీపై వెళ్ళి కొత్తవారు వచ్చారు. ప్రణాళికాబద్ధంగా విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తాం.

–బండి శేషన్న, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

హైస్కూల్లో డైనింగ్ హాలు, సైకిల్ స్టాండ్‌కు శంకుస్థాపన

రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి అధికారిక పర్యటనలో సేవలు



శంకుస్థాపన చేస్తున్న శరత్ చౌదరి

తెనాలి: రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్–3150 గవర్నర్ రొటేరియన్ కాట్రగడ్డ శరత్‌చౌదరి అధికారిక పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం తెనాలిలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, హైదరాబాద్ జూబ్లీ హిల్స్ క్లబ్ సంయుక్తంగా స్థానిక కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూల్లో డైనింగ్ హాలు, సైకిల్ షెడ్డుకు శంకుస్థాపన చేశారు. పరిసరాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, దివ్యాంగులకు 25 వీల్‌చైర్లను డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్‌చౌదరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. వీటితోపాటు ముగ్గురికి గ్యాస్‌తో పనిచేసే ఇస్త్రీ పెట్టెలను అందజేశారు. రోటరీ క్లబ్ తెనాలి అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ సోమవారపు వెంకట శివరాంప్రసాద్, ఫాస్ట్ గవర్నర్ అన్నే రత్నప్రభాకర్, డెప్యూటీ గవర్నర్ పాటిబండ్ల శివరంజని, అసిస్టెంట్ గవర్నర్ మలినేని పెరుమాళ్లు, జూబ్లీహిల్స్ క్లబ్ అధ్యక్షుడు వి.చిన్నకోటిరెడ్డి, తెనాలి క్లబ్ కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, కోశాధికారి రమేష్‌కుమార్ జైన్, జోనల్ క్లబ్ రిలేషన్స్ చైర్మన్ ఈదర వెంకట పూర్ణచంద్, గుత్తా వెంకటరత్నం, కనిగిరి మురళీకృష్ణ, దూళిపాళ్ల రవీంద్రనాథ్, చేతన్‌రాజ్ కొఠారి, జీవి నారాయణ, డాక్టర్ డి.జీవనలత, ఆలపాటి వెంకట్రామయ్య, కిరణ్, మల్లాది అర్జున్, కె.వి. సుబ్బారావు, కొల్లి రాజేంద్రప్రసాద్, గుమ్మడి ప్రసాద్ పాల్గొన్నారు.

రూ.1.30 కోట్లతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం

మంత్రి నాదెండ్ల మనోహర్



పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మనోహర్

కొల్లిపర: పల్లె పండుగల్లో భాగంగా 19 గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.30కోట్ల మంజూరయ్యాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మండలంలోని అన్నవరం, హనుమాన్‌పాలెం, తూములూరు, శిరిపురం, అత్తోట తదితర గ్రామాల్లో శనివారం పలు అభివృద్ధి పనులకు నాయకులతో కలసి శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు సిద్ధార్థ, జనసేన మండల అధ్యక్షుడు యర్రు వెంకయ్య నాయడు, తాత శివయ్య, కట్ట శ్రీహరి, భీమవరపు కిశోర్‌రెడ్డి , వేణుగోపాలరెడ్డి, సర్పంచులు కొల్లి రజని, పాలడుగు జోగేంద్ర పాల్గొన్నారు.

మల్లఖంబలో 12 మంది విద్యార్థులకు శిక్షణ



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

తెనాలి అర్బన్: స్థానిక కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు 12 మంది మల్లఖంబ క్రీడల్లో శిక్షణ పొందారని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు చిలకా సుందరరావు తెలిపారు. బాపట్లలోని వివేకానంద భవనంలో ఈ నెల 17 నుంచి జరిగిన శిక్షణలో మలఖంబ విశ్వ గురువుగా పిలబడే కోచ్ ఉదయ విశ్వనాథ్ దేశ్ పాండే వద్ద విద్యార్థులు శిక్షణ పొందినట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులను శనివారం పాఠశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాదకుమారి, కొడాలి గోవర్ధన్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

22న సామూహిక ఎలుకల నివారణ

తెనాలి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల రైతు సేవా కేంద్రాల వద్ద ఈ నెల 22న సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మండల వ్యవసాయాధికారి జి. ప్రేమ్‌సాగర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎరతో కలిపిన బ్రోమోడయోలిన్ మందును రైతులకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. 960 గ్రాముల నూకల్లో 20 గ్రాముల నూనె, 20 గ్రాముల బ్రోమోడయోలిన్ మందును కలిపి 10 గ్రాముల చొప్పున ప్యాకెట్లు చేసి ఎలుకల బొరియల్లో వేయాలని ఆయన సూచించారు. రైతులంతా ఎలుకల నివారణ కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు.

22 నుంచి ఆధార్ క్యాంపులు

కొల్లిపర: ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఈనెల 22 నుంచి 25వరకు మండలంలో ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆవరణలో స్పెషల్ ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.విజయలక్ష్మి శనివారం తెలిపారు. 22న అత్తోట, కొల్లిపర –1, తూములూరు, దంతలూరు, అన్నవరం, 23న శిరిపురం, కొల్లిపర– 2 , దావులూరు, పిడపర్రు, హనుమాన్‌పాలెంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 24న కుంచవరం, కొల్లిపర– 3 , చక్రాయపాలెం, మున్నంగి– 1 , బొమ్మువానిపాలెం, 25న చివలూరు, పిడపర్తిపాలెం , జెముడుపాడు, మున్నంగి, అత్తలూరివారిపాలెంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధార్‌లో మార్పులు , చేర్పులు చేయించుకోవాల్సిన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైకుంఠపురం దేవాలయాన్ని సందర్శించిన కమిషనర్



ఆలయంలో ప్రత్యేక పూజల్లో కమిషనర్ శ్రీరామ సత్యనారాయణ

తెనాలి: వైకుంఠపురం లక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని శనివారం సాయంత్రం దేవదాయ శాఖ కమిషనర్, ఐఏఎస్ అధికారి శ్రీరామ సత్యనారాయణ సందర్శించారు. దేవస్థాన వేద పండితులు, అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో శ్రీవారు, అమ్మవార్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులకు అందుతున్న సదుపాయాలు, అన్నప్రసాదాల విరాలను అడిగి తెలుసుకున్నారు. భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లు, ఆలయ నిర్వహణపై కమిషనరు సంతృప్తిని వ్యక్తం చేశారు. దేవస్థాన అభివృద్ధిలో తన వంతు సహకారం ఉంటుందని ఆలయ అధికారులకు చెప్పారు. ఆయన వెంట ఉప కమిషనర్ కేబీ శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా సహాయ కమిషనరు జి.మాధవి, వైకుంఠపురం దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.అనుపమ, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, శారద ఉన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు, సభ్యులు కురగంటి సునీత–రవిశంకర్, దేవరకొండ వెంకటరమణ–శంకరరావు, ఎక్స్‌అఫీషియో సభ్యుడు అళహరి రవికుమార్, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై కర్ణాటక గాత్ర సంగీత కచేరి శనివారం నిర్వహించారు. డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల నెల వారీ కార్యక్రమంలో భాగంగా చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సంగీత విద్వాన్ పోపూరి గౌరీనాథ్(విజయవాడ) పలు వాగ్గేయకార కీర్తనలు ఆలపించారు. వయోలిన్‌పై పెరవలి నందకుమార్, మృదంగంపై కె.సద్గురుచరణ్, ఘటంపై మార్టూరు హరిబాబు వాయిద్యాన్ని అందించారు. ప్రిన్సిపాల్ కేఎస్ గోవిందరాజన్ పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడే..



తెనాలిలో కురుస్తున్న వర్షం

చిన్నపాటి వర్షానికి కూడా తెనాలి పట్టణంలో రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. తెనాలి పట్టణంలో శనివారం ఉదయం ఎండ కాసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి కొద్దిసేపటికే భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటలకు పైగా ఏకధాటిగా పడటంతో పట్టణంలోని మారీసుపేట, అయితానగర్, గంగానమ్మపేట, నాజరుపేట, బుర్రిపాలెం రోడ్డు, కొత్తపేట, నందులపేట, ఆర్‌ఆర్ నగర్, చంద్రబాబు నాయుడు కాలనీ, పూలే కాలనీ, సుందరయ్యనగర్, అమరావతి ప్లాట్స్ ప్రాంతాలన్నీ జలమయయ్యాయి. కొన్ని వీధుల్లో మోకాలు లోతు వర్షం నీరు నిల్వడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. – తెనాలి అర్బన్



గంగానమ్మపేటలోని భవనంవారి వీధిలో రోడ్డుపై చేరిన వర్షం, మురుగునీరు



కొత్తపేటలో నీటిలో అవస్థలు పడుతున్న వాహనదారులు





తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి
(జూనియర్ డివిజన్) పశ్చిమగోదావరిజిల్లా, ఏలూరు
ఓ.ఎస్.నెం.552/2022

మధ్యన
బట్టిపల్లి రామవీరభద్రరావు ...వాది
మరియు
గుండవరపు అశోక్ కుమార్ ...ప్రతివాది

టు
గుండవరపు అశోకుమార్, తండ్రి (లేటు) లక్ష్మి నరసింహారావు, ప్రైవేటు ఉద్యోగి, డోర్.నెం. 1–88, ఎస్.టి కాలనీ, అంగలకుదురు గ్రామం, తెనాలి మండలం, గుంటూరు జిల్లా,

పై గ్రంథంలో వాది మీకు కోర్టు నుండి ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికీని మీరు తీసుకోనందున కోర్టు వారు ఈ పత్రికా ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా సదరు కేసు ది.19.11.2024వ తేదీ నాటికి వాయిదా ఉన్నందున మీరు ఆ రోజు ఉదయం 10 గంటలకు స్వయంగా గానీ, లాయరు గారి ద్వారా గానీ, పై కోర్టు వారి ముందు హాజరు అయి మీకు ఉన్న అభ్యంతరములను తెలియజేయగలరు. అట్లు కానిచో సదరు కేసు మీ పరోక్షమున తీర్మానము చేయగలమని ఇందు మూలంగా మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. (ది.30.09.2024 కోర్టు వారి అనుమతితో ఈ ప్రకటన జారీ చేయడమైనది.)

ఇట్లు: కె.వి.పి మాధవరావు
అడ్వకేట్ – నోటరీ, ఆఫీసు :జిల్లా కోర్టు సెంటర్, ఏలూరు.
సెల్ నెం. 9440111033.

ఏలూరు,
తేది:1–10–24

గంజాయి మత్తులో వాహనాలు ధ్వంసం



ధ్వంసం అయిన వాహనాలు

లక్ష్మీపురం: గంజాయి మత్తులో గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్‌లో ఉన్న వాహనాలను ధ్వంసం చేసిన ఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. రాజీవ్ గాంధీనగర్ 10వ లైన్ ప్రాంతానికి చెందిన పగడాల సతీష్‌కుమార్ లాలాపేటలోని బుక్ బైండింగ్ దుకాణంలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. రోజు మాదిరిగానే సతీష్ వ్యాన్‌ను ఇంటి ముందు పార్క్ చేశాడు. ఉదయం లేచి చూసే సరికి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు గంజాయి మత్తులో దారిలో ఉన్న ద్విచక్ర వాహనాలను, ఆటోలు, కార్లు ధ్వంసం చేసుకుంటూ వెళ్లారు. దీంతో బాధితులు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ధ్వంసమైన వాహనాలను పరిశీలించారు. రాజీవ్‌గాంధీనగర్ 10 వ లైన్, నాగరాజు కాలనీ ప్రాంతాలలో వాహనాలను ధ్వంసం చేసినట్టు గుర్తించారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని బాధితులుకు హామీ ఇచ్చారు.

పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీ లక్ష్మీపతి

తెనాలి అర్బన్: పారిశుద్ధ్య నిర్వహణకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం .లక్ష్మీపతి కోరారు. పట్టణంలోని 25,26,27 వార్డుల్లో శనివారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మూడు బుట్టల విధానాన్ని పట్టణంలో సక్రమంగా అమలు చేయాలని తెలిపారు. తడి, పొడి, హానికర చెత్తలను వేర్వేరుగా అందజేయాలని ప్రజలకు సూచించారు. పట్టణంలోని మురుగు కాల్వల్లో, రోడ్లపై చెత్తను వేయవద్దని, పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని కోరారు. ఆయన వెంట 25వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పలువురు శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు ఉన్నారు.